సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 18 । నవంబర్ । 2022

గడప గడపకు విశేష ఆదరణ



ఇప్పటివరకు ఏ ప్రజాప్రతినిధి పర్యటించని గ్రామాల్లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సందర్శించారు. గిరిజనుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. 8లో

ఎటపాకలో భూఆక్రమణలపై విచారణ



ఎటపాక, పురుషోత్తపట్టణం పరిధిలోని భూఆక్రమణలపై ఆదివాసీలు చేస్తున్న పోరాటంపై సబ్‌కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్, ఏఎస్పీ మహేశ్వరరెడ్డి స్పందించారు. 8లో

మాతాశిశు మరణాల నిరోధమే లక్ష్యం 8లో

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా



న్యూస్‌రీల్

నేటి కోర్టు కేసుల విచారణ వాయిదా

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించాల్సిన కోర్టు కేసుల విచారణను తాత్కాలికంగా వాయిదా వేశామని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విచారణ మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తొందరలోనే పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

నేటి పదోన్నతుల కౌన్సెలింగ్..

రంపచోడవరం: పూర్వ తూర్పుగోదావరి జిల్లా గిరిజన సంక్షేమశాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించాల్సిన పదోన్నతి కౌన్సెలింగ్ వాయిదా పడినట్లు డీడీ సీహెచ్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన కారణాల దృష్ట్యా వాయిదా వేసినట్లు తెలిపారు. కౌన్సిలింగ్ తేదీని తిరిగి తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీ, గురుకులం ఆకస్మిక తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న ఉన్నతాధికారి సుబ్రమణ్యం

జి.మాడుగుల: స్థానిక పీహెచ్‌సీ, గురుకుల పాఠశాలను లెప్రసీ విభాగం ఏడీఎంహెచ్‌వో సుబ్రమణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్య సేవలు, ప్రసవాలు, బాలింతలు, రోగుల వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం గురుకుల పాఠశాలలో లెప్రసీ కార్యక్రమంపై ఆయన ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, ఎంపీహెచ్‌ఈవో ఎన్.ప్రకాష్ పాల్గొన్నారు.

108లో సుఖ ప్రసవం



శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎంటీ శ్రీను

జి.మాడుగుల: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో తరలిస్తుండగా మార్గంమధ్యలో ఆడశిశువుకు జన్మనిచ్చింది. మండలంలోని ఉవ్వాసింగి పంచాయతీ తియ్యగుండం గ్రామానికి చెందిన లోతేరు రూతు గురువారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వాహనంలో ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో రచ్చపల్లి గ్రామ సమీపాన ప్రసవించినట్టు ఈఎంటీ శ్రీను, పైలెట్ లక్ష్మణ్ తెలిపారు.తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని స్థానిక ఆస్పత్రికి తరలించినట్టు వారు తెలిపారు.

జీసీసీకి కాఫీ గింజలు విక్రయిస్తే అధిక ఆదాయం



రైతులతో మాట్లాడుతున్న డీఎం సింహాచలం

చింతపల్లి రూరల్: ఆదివాసీ రైతులు పండించిన కాఫీ గింజలను జీసీసీకి విక్రయించి అధిక ఆదాయం పొందాలని ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ సింహాచలం సూచించారు. గురువారం ఆయన కాఫీ రైతులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలో కాఫీ పార్చిమెంట్ 80 మెట్రిక్ టన్నులు, చెర్రీ 320 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పార్చిమెంట్ కిలోకు రూ.270, చెర్రీకి రరూ.135, రొబస్టా రూ.60 చొప్పున ధర నిర్ణయించామన్నారు. పాడేరు, అరకు డివిజన్ పరిధిలోని కాఫీతోటల్లో ముందస్తుగా, చింతపల్లి డివిజన్ పరిధిలో వచ్చేనెల మూడవ వారంలో దిగుబడి వస్తాయని తెలిపారు. దళారీలకు అమ్మి నష్టపోవద్దని జీసీసీకి మాత్రమే విక్రయించాలని సూచించారు. మండలలోని బూసులుకోట, కిటుముల, భీముడుచట్రు గ్రామాలను ఆయన సందర్శించారు.

టర్కీ తరహా గుహ..

సరికొత్తగా జలపాతం



బొర్రా గుహల పక్కన ఉన్న గుర్తించిన మరో భారీ గుహ

సాక్షి, విశాఖపట్నం : ప్రకృతి అందాలతో అలరారే ఉమ్మడి విశాఖను పర్యాటకంలో కొత్త పుంతలు తొక్కించేందుకు వినూత్న ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. అన్ని వర్గాల పర్యాటకులను మరింత ఆకర్షించేందుకు ప్రత్యేకమైన థీమ్ టూరిజం ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాలని భావిస్తోంది. అలాగే ఇటీవల వెలుగులోకి వచ్చిన అబ్బురపరిచే గుహతో పాటు ఔరా అనిపించే జలపాతాన్ని భిన్నమైన రీతిలో అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తోంది. ఆంధ్రా ఊటీ ఏజెన్సీ ప్రాంతంలో గుర్తించిన ఈ రెండు ప్రాంతాలను ప్రపంచ పర్యాటకులకు సరికొత్తగా పరిచయం చేసేందుకు సన్నద్ధమవుతోంది. టర్కీ దేశంలో ఉన్న కేవ్ రిసార్ట్‌లు మాదిరిగా ఈ గుహని తీర్చిదిద్దడంతోపాటు నాలుగు స్టెప్స్‌గా జాలువారుతూ ఉన్న ఈ జలపాతాన్ని అభివృద్ధి చేయాలని భావిస్తోంది. ఇవి పర్యాటకులకు కొత్త అనుభూతి కలిగించనున్నాయి.

కేవ్ రిసార్ట్‌లు మాదిరిగా..

తన బృందంతో టూరిజం ఆర్‌డీ శ్రీనివాస్ పాణి నిరంతర అన్వేషణ సాగిస్తున్న సమయంలో అనంతగిరి సమీపంలో కొత్త టూరిస్ట్ స్పాట్ తారసపడింది. దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్న బొర్రా గుహలకు కేవలం కిలోమీటర్ దూరంలోనే మరో గుహని కనుగొన్నారు. బొర్రా గుహల్లోకి సూర్యరశ్మి చేరదు.



అనంతగిరి సమీపంలో గుర్తించిన కొత్త జలపాతం

కానీ.. ఈ గుహలోకి నేరుగా సూర్యకిరణాలు ప్రవేశిస్తున్నాయి. అద్భుతంగా ఉన్న ఈ ప్రాంతాన్ని విదేశీ తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రాచీన కాలంలో గుహల్లో జీవించే ఆదిమానవులు కాన్సెప్ట్‌తో.. ఆ కాలానికి వెళ్లే అనుభూతి కలిగించేలా టర్కీ దేశంలో ఉన్న కేవ్ రిసార్ట్‌లు మాదిరిగా ఈ గుహని తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. మొత్తం 3 గదులను ఈ గుహలో నిర్మించి.. ప్రకృతితో కలిసి రాత్రుళ్లు బస చేసే ఏర్పాట్లు చేయనున్నారు. రిసార్టులకు అనుసంధానంగా రెస్టారెంట్ కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలు కూడా టూరిజం అధికారులు చేస్తున్నారు.

పర్యాటకం పుంతలు

- **ఏజెన్సీలో గుర్తించిన జలపాతం, గుహ అభివృద్ధికి ప్రతిపాదనలు**
- **కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్న ప్రభుత్వం**
- తీర ప్రాంతాల్లో సైక్లింగ్, వాటర్, అడ్వెంచర్ స్పోర్ట్స్

అందాలలో.. అహో జలపాతం

ఏజెన్సీలోని టోకూరు పంచాయతీ పరిధిలోని చిట్టంపాడు గ్రామ సమీపంలో పచ్చని పొలాల మధ్యలో రెండు కొండల నడుమ అద్భుతమైన జలపాతం కనిపించింది. ఎత్తయిన కొండలపై నుంచి కిందకు పడుతున్న జలప్రవాహం మంత్రముగ్ధులను చేస్తోంది. మొత్తం నాలుగు స్టెప్స్‌గా జాలువారుతూ ఈ భారీ జలపాతాన్ని చూస్తే.. ఎవరైనా మైమరచిపోవాల్సిందే. అనంతగిరి పంచాయతీ మొండి జామిగుడ గ్రామస్తులు ఇక్కడ జలపాతం ఉన్నట్లు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. ఏజెన్సీలో ప్రస్తుతం ఉన్న వాటర్ ఫాల్స్‌లా దీన్ని కూడా అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ భావిస్తోంది. దీన్ని అభివృద్ధి చేస్తే పర్యాటకులకు కొత్త అనుభూతి కలగడంతో పాటు స్థానిక గిరిజనులకు **కూడా టూరిస్టుల రాకతో ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. కేవలం జలపాతంలా కాకుండా ఇక్కడ** ట్రెక్కింగ్ చేసుకునేందుకు వనరులుండటం విశేషం.

తీరాల్లో సరికొత్త ఆనందాలు

ప్రభుత్వం తీసుకొచ్చిన పర్యాటక పాలసీతో మాత్రమే కాకుండా తాము అందిస్తున్న వెసులుబాట్లతో పెట్టుబడులను ఆకర్షిస్తూ ఆయా టూరిజం ప్రాంతాలను అభివృద్ధి చేయాలని అధికారులు విభిన్న తరహా ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారు. ఇందులో భాగంగా దేశ, విదేశీ పర్యాటకుల్ని ఆకర్షించేలా రూరల్ టూరిజం, హెరిటేజ్ టూరిజం, బుద్ధిస్ట్ టూరిజం, ఎకో టూరిజం, బీచ్ అండ్ వాటర్ టూరిజం, రిక్రియేషన్ అండ్ అడ్వెంచర్ టూరిజం, రిలీజియస్ టూరిజం, క్యూజిన్ టూరిజం, వెల్‌నెస్ టూరిజం, ఎంఐసీఈ టూరిజం, మెడికల్ టూరిజం వంటి విభాగాల్లో ఆయా జిల్లాల్లో కొత్త ప్రాజెక్టులకు ప్రణాళికలు తయారుచేశారు. విశాఖలోని వివిధ బీచ్‌లలో జెట్‌స్కై, స్పీడ్ బోట్, కయాకింగ్, ట్రాంపోలిన్, స్టాండప్ పెడల్, స్కూబా డైవింగ్, నెట్ క్రికెట్, వాటర్ సైక్లింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ స్పోర్ట్స్‌ను పరిచయం చేస్తున్నారు.

కొత్త ప్రాజెక్టులు



సరికొత్త పర్యాటకాన్ని విశాఖ వచ్చే టూరిస్టులకు పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. టూరిజం ఎండీ కన్నబాబు సూచనల మేరకు కొత్త కొత్త ప్రాంతాలను అన్వేషిస్తున్నాం. విశాఖకు మళ్లీ మళ్లీ వచ్చే పర్యాటకులకు కొత్త టూరిజం స్పాట్స్ అందించాలన్నదే మా లక్ష్యం. బొర్రా పక్కన ఉన్న కొత్త గుహల అభివృద్ధికి అటవీ, ఇతర శాఖల అనుమతుల కోసం లేఖలు రాశాం. అదే విధంగా ప్రతి పర్యాటక స్థలంలోనూ ఒక విభిన్న ప్రాజెక్టును.. దేశ విదేశీ సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్న ఆలోచనలతో ముందుకు వెళ్తున్నాం.

– శ్రీనివాస్ పాణి,
పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్

ముగిసిన గిరిజన ఉత్సవ్



మట్టి పాత్రను తయారు చేస్తున్న గిరిజనుడు



గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శన

- నేడు ఆర్.కె.బీచ్‌లో స్వచ్ఛభారత్

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ.. జనజాతీయ గౌరవ్ దివస్‌లో భాగంగా బీచ్‌రోడ్డులో నిర్వహించిన ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. విశ్వప్రియ ఫంక్షన్ హాలు ఎదురుగా బీచ్‌లో చివరి రోజు రాష్ట్రంలోని వివిధ గిరిజన ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తులు నగరవాసులను ఆకట్టుకున్నాయి. వారి సంప్రదాయలు, సంస్కృతులకు ఆకర్షితులై.. పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శన నగరవాసులతో పాటు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.

నేడు బీచ్‌లో స్వచ్ఛభారత్ : గిరిజన గౌరవ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్.కె.బీచ్‌లో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్నారు. దీనిని కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ప్రారంభిస్తారు.

క్రీడల్లో రెవెన్యూ ఉద్యోగుల ప్రతిభ

అభినందించిన రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్



పతకాలు సాధించిన రెవెన్యూ ఉద్యోగులను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడల్లో ఏజెన్సీ రెవెన్యూ ఉద్యోగులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆరవ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు–2022ను ఈనెల 11 నుంచి 14 వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో నిర్వహించారు. జిల్లా తరపున రంపచోడవరం డివిజన్ నుంచి క్రీడల్లో పాల్గొన్న వారు వివిధ పోటీల్లో పతకాలు సాధించారు. అథ్లెటిక్స్ విభాగంలో 45 ఏళ్ల పైబడిన కేటగిరీలో షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ సహాయకునిగా విధులు నిర్వహిస్తున్న కొలిపే విక్టర్ పాల్(పాల్‌బాబు) కాంస్య పతకాలు సాధించారు. మహిళల విభాగంలో డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో ఇందిరాబాయి (రంపచోడవరం తహసీల్దార్ కార్యాలయం ఎన్నికల సీనియర్ సహాయకులు) వెండి పతకాలను సాధించారు. టగ్ ఆఫ్ వార్‌లో రెవెన్యూ ఉద్యోగులు వీఆర్వో చింతాలమ్మ, ఏఆర్వో కె.మల్లమ్మ ద్వితీయ స్థానం సాధించారు. రెవెన్యూ క్రీడల్లో శివకుమార్, పవనేంద్రకుమార్, గంగరాజు పాల్గొన్నారు. రెవెన్యూ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన ఉద్యోగులను రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అభినందించారు. రంపచోడవరం తహసీల్దార్ పీఎస్‌పీ ప్రసాద్, రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ పాషా(అక్రం) పాల్గొన్నారు.

గిరి విద్యార్థి మృతిపై వీడని మిస్టరీ



ఆశ్రమ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబాలు,విద్యార్థి,ప్రజాసంఘాలు (ఇన్‌సెట్) నవీన్ (ఫైల్)

- విచారణ వేగవంతం చేయాలి
- జిల్లా ఆస్పత్రి ఎదుట తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల బైఠాయింపు
- బాధ్యులను శిక్షించాలని విద్యార్థి సంఘాల ధర్నా
- జరగని శవ పంచనామా

సాక్షి,పాడేరు: స్థానిక లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి పాంగి నవీన్ మృతిపై మిస్టరీ వీడలేదు. బుధవారం విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన స్థానిక పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అమరావతిలోని సమావేశాల్లో ఉన్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ కూడా ఈ కేసు దర్యాప్తుపై ప్రత్యేకదృష్టి సారించారు. సమగ్ర విచారణకు పోలీసు అధికారులను ఆదేశించారు. ఇక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు వారు ఫోన్ల ద్వారా సమీక్షిస్తున్నారు. ఇలావుండగా మృతుడి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు, కులపెద్ద లు గురువారం ఉదయాన్నే ఇక్కడి జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. నవీన్ మృతదేహన్ని వారు చూసి బోరున విలపించారు. జిల్లా ఆస్పత్రి వద్ద విద్యార్థి, పలు ప్రజా సంఘాలతో కలిసి బైఠాయించి ఆందోళన చేపట్టారు.అక్కడ నుంచి వారంతా లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చేరుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ,జీఎస్‌యూ విద్యార్థి సంఘాలతో పాటు రాజకీయ పార్టీల నేతలు కూడా ఆందోళనకు మద్దతు ఇవ్వడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీఐ సుధాకర్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు పలు ధపాలుగా ఆందోళనకారులతో చర్చలు జరిపినప్పటికీ వారు ఆందోళనను విర మించలేదు. రాత్రి వరకు కొనసాగించారు.విద్యార్థి సంఘాల పిలుపు మేరకు పాడేరు మండలంలోని అన్ని విద్యాలయాలు మూతపడ్డాయి.బాధిత కుటుంబాలు, ప్రజా, విద్యార్థి సంఘాల ఆందోళనతో విద్యార్థి నవీన్ మృతదేహనికి సాయంత్రం వరకు శవపంచనామా జరగలేదు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. అక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థి నవీన్ అనుమానాస్పద మృతికి సంబంధించి సమగ్ర విచారణ జరుపుతున్నామని వివరించారు.

నా కుమారుడిది హత్యే: తండ్రి మహేంద్ర



నవీన్ తల్లిదండ్రులు

నా కుమారుడు పాంగి నవీన్‌ది హత్యేనని, దీనిపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని తండ్రి మహేంద్ర డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ నవీన్ ఈనెల 11వతేదీన జి.మాడుగుల మండలం గెమ్మెలి పంచాయతీలోని సుర్లపాలెంలోని తమ ఇంటికి వచ్చాడని వివరించాడు. మంగళవారం మళ్లీ గెమ్మెలి బస్ ఎక్కించి, కొందరి తోడుతో పాడేరులోని పాఠశాలకు పంపానని ఆయన తెలిపాడు. నవీన్ పాఠశాలకు వెళ్లాడా లేదా అనే అనుమానంతో బుధవారం లోచలిపుట్టు పాఠశాలకు వచ్చినట్టు చెప్పాడు. అయితే సాయంత్రం వరకు వేచి ఉండమని సిబ్బంది చెప్పడంతో మళ్లీ స్వగ్రామానికి వెళ్లిపోయానని, తీరా రాత్రి నవీన్ చనిపోయాడని కబురు వచ్చిందని కన్నీళ్ల పర్యాంతమయ్యాడు. మధ్యాహ్నం నా కుమారుడిని చూపించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆయన వాపోయాడు. పాడేరు సినిమాహాల్‌లో పనిచేస్తున్న సన్యాసిరావు నాకు వరుసకు తమ్ముడు అవుతాడని, అతనే నవీన్‌ను హత్య చేసి ఉండవచ్చని అనుమానంగా ఉందని తెలిపారు. ఈ కోణంలో కూడా పోలీసులు విచారణ జరిపాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరాడు. తమకు ప్రభుత్వం నష్టపరిహారంతో పాటు,ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశాడు.

రాగుల సాగులో రికార్డ్

జిల్లాలో గిరి రైతుల సాగు విధానంలో చాలా మార్పు కనిపిస్తోంది. ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తుల సాధనకు వారు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రకృతి విధానాన్ని అవలంభిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. శ్రీవరి విధానంలో రాగుల పంటను సాగు చేసి రికార్డుస్థాయిలో దిగుబడి సాధిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

రికార్డు స్థాయిలో దిగుబడి



డుంబ్రిగుడ మండలం కిల్లోగూడ గ్రామానికి చెందిన ఈమె పేరు కిల్లో రంభ. రాగుల సాగును ప్రకృతి విధానంలో చేపట్టి రికార్డు స్థాయిలో దిగుబడి సాధించింది. చింతపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జోగారావు, డాక్టర్ రాజేంద్రకుమార్, డాక్టర్ శ్రీనివాస్, రైతు సాధికార సంస్థ ఎస్‌ఆర్పీ దేముళ్లు సమక్షంలో ఇటీవల పంట కోత చేపట్టారు. 5x5లో చేపట్టిన పైరు నుంచి 12.31 కిలోల దిగుబడి వచ్చింది. దీని ఆధారంగా ఎకరాకు తేమ శాతం 20 మినహాయించగా 17.75 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్టు నిర్ధారించారు. అధిక దిగుబడి రావడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది.



కిల్లోగూడలో శ్రీవరి పద్ధతిలో సాగు చేపట్టిన రాగుల పైరు

- గులిసాగు పద్ధతిని అవలంభిస్తున్న గిరి రైతులు
- ప్రకృతి విధానం జోడింపు
- ఎకరాకు 17 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి
- ఉత్తమ ఫలితాలు సాధించిన మహిళా రైతు కిల్లో రంభ
- ప్రోత్సహిస్తున్న రైతు సాధికార సంస్థ

సాక్షి, పాడేరు: జిల్లాలో గులి (శ్రీవరి సాగు) పద్ధతిలో రాగుల పంటకు ప్రకృతి విధానం జోడించి ఈ ఏడాది సాగు చేపట్టారు. రికార్డుస్థాయిలో దిగుబడులు సాధిస్తున్నారు. సాధారణ పద్ధతిలో రాగులు సాగు చేయడం వల్ల ఎకరాకు రెండు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చేవి. ఆధునిక సేద్య పద్ధతులను అవలంభించడం వల్ల దాదాపుగా 20 క్వింటాళ్ల దిగుబడి సాధించినట్టు పంటకోట ప్రయోగంలో వెల్లడైంది. రాగుల సాగుకు ఏజెన్సీ వాతావరణం అనుకూలంగా ఉండటంతో ప్రకృతి విధానంలో గత ఐదేళ్లుగా రైతు సాధికార సంస్థ ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఖరీఫ్‌లో 3,621 మంది రైతులతో 2,184.91 ఎకరాల్లో ప్రకృతి పద్ధతిలో రాగుల సాగుకు ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే 2,510 మంది రైతులు మాత్రమే 1438.95 ఎకరాల్లో సాగుచేపట్టారు. ప్రకృతి విధానంలో సాగు చేయడం వల్ల రాగులు విరగ్గాశాయి.

గతంలో ఎకరాకు ఐదు క్వింటాళ్లే


పదేళ్ల క్రితం రాగి పంటను సాధారణ పద్ధతిలో సాగు చేసేవారు. ఎక్కువ విత్తనాలతో దగ్గర, దగ్గరగా ముదురు నారుతో నాట్లు వేసేవారు. దీనికి పంట ప్రారంభంలో పశువుల గెత్తం మాత్రమే వేసేవారు. అరకొరగా కలుపు తొలగించేవారు. ఎకరాకు ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు.

శ్రీవరి విధానంతో మేలు

శ్రీ వరి పద్ధతి మాదిరిగా కేరళలో గులి రాగి పేరుతో సాగు చేస్తున్న విధానాన్ని రైతు సాధికార సంస్థ, సంజీవిని వంటి సంస్థలు గతంలో అధ్యయనం చేశాయి. ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పించాయి. ఈ విధానానికి రైతులు అలవాటు పడటంతో ఏటా ప్రకృతి విధానంలో సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

➠ మొక్కల మధ్య దూరం ఉండేటట్లు చూసుకుని లేత నారును వరుసల విధానంలో నాటారు. ప్రారంభంలో ఘన జీవామృతం, తరువాత 15 రోజుల కొకసారి ద్రవ జీవామృతం వినియోగించారు. కలుపును తొలగించి అంతర కృషి చేపట్టారు. పిలకలు ఎక్కువగా రావడానికి తేలికపాటి కర్ర దుంగను మొక్కలపై నుంచి తూర్పు నుంచి పడమర, ఉత్తరం నుంచి దక్షిణం లాగారు. ప్రకృతి విధానంలో పద్ధతులను అనుసరించడం ద్వారా ఎకరాకు 17 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి సాధించ గలిగారు.

అధిక దిగుబడులతో ఆర్థికాభివృద్ధి



గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది.కిల్లోగుడ గ్రామంలో కిల్లో రంభ అనే మహిళా రైతు ఎకరాకు 17.95 క్వింటాళ్ల రాగులు దిగుబడి సాధించడం రికార్డుగా చెప్పవచ్చు. రాగులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. రైతులు శ్రద్ధగా సాగు చేపడితే మంచి ఆదాయం పొందవచ్చు. మార్కెట్లో కిలో రూ.30నుంచి రూ.40వరకు ధర ఉంది.

– మోహన్‌రావు, మేనేజర్,
జిల్లా రైతు సాధికార సంస్థ

మాతాశిశు మరణాల నిరోధమే లక్ష్యం

● డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న గైనికాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులంతా మాతా శిశుమరణాల నిరోధమే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో వైద్యులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ నెలకు సంబంధించి మాతాశిశు మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో సుఖ ప్రసవాలకు పీహెచ్‌సీల వైద్యబృందాలన్నీ శ్రమిస్తున్నాయన్నారు. జిల్లా ఆస్పత్రితో పాటు,ప్రాంతీయ ఆస్పత్రులు,కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రసవాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రసవాలు జరిగిన తరువాత తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించి కొద్దిరోజుల పాటు ఆస్పత్రుల్లోనే వారిని ఉంచాలని సూచించారు. కాన్పులు అయిన వెంటనే ఇళ్లకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

ట్రాక్టర్ బోల్తా పడి బుచ్చెయ్యపేట సర్పంచ్ మృతి

● మండల కేంద్రంలో తీవ్ర విషాదం
● మృతుని పాడె మోసిన మాజీ మంత్రి గంటా, మాజీ ఎమ్మెల్యే రాజు


సుంకరి సూరిబాబు(ఫైల్)


సూరిబాబు భౌతికాయాన్ని మోస్తున్న గంటా, రాజు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట సర్పంచ్ సుంకరి సూరిబాబు (48) తన పశువుల పాక వద్ద ట్రాక్టర్‌తో మట్టి వేయిస్తుండగా ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందారు. సూరిబాబు అకాల మృతితో గ్రామంలో తీవ్ర విషాదం అల్లుకుంది. బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో తన పశువుల పాక వద్ద లోతుగా ఉన్న ప్రాంతంలో ట్రాక్టర్‌తో మట్టి వేయించి ఎత్తు చేయిస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు వెంటనే పొక్లెయిన్‌తో ట్రాక్టర్ తొట్టెను తీయించి గాయాలైన సూరిబాబును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు. మృతునికి భార్య లక్ష్మి, పెళ్లైయిన కుమార్తె, బీటెక్ చదువుతున్న కుమారుడు ఉన్నారు. బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి సంఘటన స్థలాన్ని పరిశీలించి సూరిబాబు మృతదేహాన్ని గురువారం ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టమ్ చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బుచ్చెయ్యపేటలో తీవ్ర విషాదం :

సర్పంచ్ సూరిబాబు అకాల మృతితో బుచ్చెయ్యపేటలో తీవ్ర విషాదం అలముకుంది. పార్టీలకు అతీతంగా ఎవరికి ఏ కష్టం వచ్చిన సూరిబాబు ముందుండి వారి కష్టంలో పాల్గొనే వారు. గురువారం ఉదయం గ్రామ పంచాయతీ వద్ద విశాఖ ప్రవేటు ఆసుపత్రి సిబ్బందితో వైద్య శిబిరానికి తగిన ఏర్పాట్లు చేయించారు. ఇంతలోనే సూరిబాబు మృతి చెందాడని తెలిసి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడిగా, మండల రైతు సంఘం నాయకుడిగా గతంలో పనిచేయగా ప్రస్తుతం గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇతని మరణవార్త తెలుసుకున్న విశాఖ డెయిరీ ట్రస్టు చైర్మన్ ఆడారి ఆనంద బాబు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ నాగేశ్వరిదేవి, మండల పార్టీ అధ్యక్షుడు అచ్చింనాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాతయ్యబాబు తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సూరిబాబు అంతిమ యాత్రలో పాల్గొని అతని భౌతిక కాయాన్ని కొంత దూరం మోశారు. పలు గ్రామాల నుంచి ప్రజలు, నాయకులు సూరిబాబు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

గడప గడపకు విశేష ఆదరణ

● శివారు గ్రామాల్లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పర్యటన
● గిరిజనుల ఘన స్వాగతం


పట్టాను ఇస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


గ్రామస్తులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

కొయ్యూరు: ఇప్పటివరకు ఏ ప్రజాప్రతినిధి వెళ్లని గ్రామాల్లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సందర్శించారు. గిరిజనులను ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు... ఎమ్మెల్యే రాకతో గిరిజనులు ఎంతో సంతోషించారు. ఆమెకు సంప్రదాయంగా ఘన స్వాగతం పలికారు.. మండలంలోని అంతాడ పంచాయతీ ఎద్దుమామిడి, సింగధార, టేకురాయి, దేకురాయి, టెంకలపనుకు లు గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. కొండలు, గుట్టలను కాలినడక ద్వారా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల్లో 200 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

ఏజెన్సీ అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

ఎద్దుమామిడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వల్లే సాధ్యమన్నారు. ఏజెన్సీలో శివారు గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టా హక్కును ప్రభుత్వం కల్పించిందన్నారు. అర్హులైన అందరికీ పట్టాలు మంజూరవుతున్నాయన్నారు. ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి, సంక్షేమాన్ని జగనన్న ప్రభుత్వం చేస్తోందన్నారు. సమాచార వ్యవస్థకు అంతరాయంగా మారిన అనేక గ్రామాల్లో టవర్లను శరవేగంగా నిర్మిస్తున్నట్టు చెప్పారు. త్వరలో అన్ని గ్రామాల్లో సెల్ సేవలు అందుబాటులో వస్తాయన్నారు. ప్రభుత్వం అర్హులందరికీ గృహాలు మంజూరు చేస్తోందని, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిషన్ కనెక్ట్ పాడేరులో ప్రాజెక్టు ద్వారా అనేక గ్రామాలకు రహదారులు నిర్మించామన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా సుపరిపాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వం మరలా అధికారంలోకి వచ్చేందుకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, వైస్ ఎంపీపీలు అప్పన గజ్జయ్యదొర, అంబటి నూకాలు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, మహిళా విభాగ అధ్యక్షురాలు కె.రాజులమ్మ, సర్పంచ్‌లు కురుజు పెంటమ్మ, సుర్ల చంద్రరరావు, నత్తూరు సోమన్నదొర, రాజకుమారి, ఎంపీడీవో మేరీరోజ్, తహసీల్దార్ తిరుమలరావు, ఎంఈవో బోడంనాయుడు, డౌనూరు ఎంపీటీసీ సభ్యురాలు బిడిజన అప్పారావు, నాయకులు శేఖర్, అచ్చిరాజు, గంగాధర్, సుధాకర్, వనంబాబు, ఉల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలు అదృశ్యం

అనకాపల్లిటౌన్ : ఇద్దరు మహిళలు అదృశ్యమైనట్టు పట్టణ ఎస్ఐ వెంకన్న గురువారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన అక్కచెల్లెలు అయిన పోతల లక్ష్మి, పోతల చంద్రమ్మలు స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో జరుగుతున్న సదరం శిబిరానికి వచ్చారు. ఇద్దరు కుమార్తెలను వైద్యాలయంలో కూర్చోమని, జెరాక్స్ నిమిత్తం బయటకెళ్లి తండ్రి నారాయణరావు వచ్చేసరికి వారిద్దరూ కనిపించలేదని ఎస్ఐ పేర్కొన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

సంతలో 275 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

వ్యాపారిపై క్రిమినల్ కేసు నమోదు


గుత్తులపుట్టు సంతలో స్వాధీనం చేసుకున్న బియ్యంతో పౌరసరఫరాల అధికారులు

సాక్షి, పాడేరు: గుత్తులపుట్టు వారపు సంతలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సంతలో పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేస్తూ మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టగా 6 ప్లాస్టిక్ బ్యాగులలో నింపిన 275 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. ఎం.కోడూరుకు చెందిన కిరణ్‌కుమార్ అనే వ్యాపారి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించారు. అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు తూనిక యంత్రం, బియ్యాన్ని సీజ్ చేశామని జిల్లా పౌర సరఫరాల అధికారి శివప్రసాద్ విలేకరులకు తెలిపారు. ప్రజా పంపిణీకి సంబంధించిన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు కొనడం, మైదాన ప్రాంతాలకు తరలించి అమ్మకాలు జరపడం నేరమని, అలాంటి వ్యాపారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గిరిజన ప్రాంతాలలోని వారపు సంతలు, మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్‌లలో నిరంతరం తనిఖీలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్ కుమార్, నూకురు, గుత్తులపుట్టు డీఆర్ డిపోల సేల్స్‌మెన్‌లు పాల్గొన్నారు.

10 లీటర్ల సారాతో ఒకరి అరెస్ట్


పులుపు ధ్వంసం చేసిన ఎస్ఐ తదితరులు

రావికమతం : పిల్లవానిపాలెం గ్రామానికి చెందిన అయితిరెడ్డి శ్రీను10 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు.ఆ గ్రామ శివార్లలోని పొలాల్లో నాటు సారా తయారీ చేస్తున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల పులుపును ధ్వంసం చేశామని, సారా తరలిస్తుండగా నిందితుడిని పట్టుకున్నామని తెలిపారు.

ఎటపాకలో భూఆక్రమణలపై విచారణ

● వివాదాస్పద భూముల పరిశీలన
● వివరాలు తెలుసుకున్న సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఏఎస్పీ మహేశ్వరరెడ్డి
● శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

ఎటపాక: కొద్దిరోజులుగా ఎటపాక, పురుషోత్తపట్టణం పరిధిలోని భూఆక్రమణలపై ఆదివాసీలు చేస్తున్న పోరాటంపై సబ్‌కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్, ఏఎస్పీ మహేశ్వరరెడ్డి స్పందించారు. దీనిలో భాగంగా గురువారం విచారణ చేపట్టారు. లక్ష్మీదేవిపేటలో గిరిజనేతరులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వివాదం నెలకొంది. పురుషోత్తపట్టణంలోని భద్రాద్రి దేవస్థానం భూముల ఆక్రమణలను వ్యతిరేకిస్తూ ఆంధ్రా,తెలంగాణ ప్రాంతాలనుంచి ఆదివాసీలు వేలాది మంది తరలివచ్చి వివాదస్పద భూముల్లో పచ్చ జెండాలు ఏర్పాటు చేశారు. గుడిసెల నిర్మాణాలు చేపట్టడంతో రాష్ట్ర సరిహద్దుల్లో నాలుగు రోజులుగా ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఉన్నతాధికారులు స్పందించి వివాదస్పద భూములను పరిశీలించిన అనంతరం ఎటపాకలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులతో సమావేశమయ్యారు. భూపోరాటాలకు గల కారణాలను వారి నుంచి తెలుసుకున్నారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా వలస గిరిజనేతరులు వందలాది ఎకరాల ప్రభుత్వ, దేవాదాయ భూములను ఆక్రమించి నిర్మాణాలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని ఏపీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ ఆరోపించారు. రెవెన్యూ శాఖలోని గత అధికారులు రూ.లక్షల్లో ముడుపులు తీసుకుని తప్పుడు హక్కు పత్రాలు జారీచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న గిరిజనేతరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని నిర్మాణాలు కూల్చివేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆదివాసీ చట్టాలను తుంగలోతొక్కి గిరిజనేతరులకు తప్పుడు డాక్యుమెంట్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకునేంతవరకు తమ న్యాయ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేవారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్ హామీ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఏఎస్పీ హెచ్చరించారు.ఈ సమావేశంలో జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎటపాక సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఆదివాసీ నేతలు మడివి నెహ్రూ, ఉబ్బా సత్యం, కుంజా ధర్మా, గొంది వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ మంగేశ్వరావు పాల్గొన్నారు.

బ్యాంక్‌లో నగదు విత్‌డ్రాకు అష్టకష్టాలు

● వృద్ధురాలిని పల్లకిలో తరలింపు
● ఆరు కిలోమీటర్ల మేర మోత
● అవస్థలు పడిన కుటుంబసభ్యులు, గ్రామస్తులు
● బ్యాంక్ అధికారుల తీరుపై పలువురి ఆవేదన




వృద్ధురాలు బిమలను పల్లకిలో తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) బిమల

ముంచంగిపుట్టు: బ్యాంక్‌లో దాచుకున్న నగదు విత్‌డ్రా నిమిత్తం ఒకటి కాదు.. రెండు కాదు.. ఆరు కిలోమీటర్ల మేర వృద్ధురాలిని పల్లకిలో మోసుకొని తీసుకువెళ్లారు. వివరాలిలాఉన్నాయి. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కిమలమామిడి గ్రామానికి చెందిన కొర్రా బిమల (73)అనే వృద్ధురాలు స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.15 వేలు దాచుకొంది. నడవలేని పరిస్థితిలో ఉన్న ఆమె బ్యాంక్‌లో నగదును విత్ డ్రా చేయాలని కొడుకు అర్జున్‌ను కోరింది. దీంతో అతను స్థానిక ఎస్‌బీఐ అధికారులను కలిసి పరిస్థితి వివరించారు. కచ్చితంగా వృద్ధురాలిని తీసుకురావాల్సిందేనని వారు చెప్పారు. దీంతో సరైన రహదారి లేని కిమలమామిడి గ్రామం నుంచి కొడుకు అర్జున్, కోడలు పూర్ణిమ,బంధువులు కలిసి పల్లకిలో ఆమెను కొండమార్గంలో పొలం గట్లమీదుగా ఆరు కిలోమీటర్ల మేర మోసుకొని ఎంతో శ్రమించి తీసుకువెళ్లారు. విత్ డ్రా చేసి ఆమెను మళ్లీ అదేవిధంగా గ్రామానికి తీసుకువచ్చారు. నగదు విత్ డ్రా విషయంలో కనికరించని బ్యాంక్ అధికారుల తీరుపట్ల వారంతా మండిపడ్డారు. తమ గ్రామానికి సరియైన రహదారి సౌకర్యం లేక నిత్యం అవస్థలు పడుతున్నామని కిమలమామిడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. పరిస్థితి తెలిసి కూడా బ్యాంక్ అధికారులు కనికరించకపోవడం బాధించిందని వారు వాపోయారు. ప్రభుత్వం స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

వైద్య ఆరోగ్య శాఖలో పలు పోస్టుల భర్తీ

● దరఖాస్తుకు 22వ తేదీ ఆఖరు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్, ఆప్తాలమిస్ట్, ఆడియోలజిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్, డెంటల్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఎంపికైన వారు అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ఆస్పత్రిల్లో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. https://visakhapatnam.ap.gov.in లో పొందుపరిచిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతోపాటు విద్యార్హత ధ్రువీకరణపత్రాల జిరాక్స్ కాపీలను ఈ నెల 22న సాయంత్రం 5 గంటల్లోపు విశాఖపట్నం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలని కోరారు. పోస్టుల భర్తీ, ఇతర వివరాలకు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

డోలీలో ఆస్పత్రికి తరలిస్తుండగా వృద్ధురాలి మృతి

● మార్గంమధ్యలో విషమించిన ఆరోగ్యం
● విడిచిన ప్రాణం




అనారోగ్యానికి గురైన గంగమ్మను డోలీలో తీసుకువెళ్తున్న కుటుంబసభ్యులు (ఇన్‌సెట్) మృతి చెందిన గంగమ్మ

అనంతగిరి: అనారోగ్యానికి గురైన ఓ వృద్ధురాలిని వైద్యం నిమిత్తం డోలీలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. వివరాలిలావున్నాయి. మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ గుమ్మంతి గ్రామానికి చెందిన గెమ్మిలి గంగమ్మ (60) అనారోగ్యానికి గురైంది. ఆమెను గురువారం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డోలీలో పినకోట పీహెచ్‌సీకి తరలిస్తుండగా గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం వచ్చేసరికి పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. వెంటనే మృతదేహాన్ని అదే డోలీలో గ్రామానికి తరలించారు. సరైన రహదారి సౌకర్యం లేక గంగమ్మ మృతి చెందిందని, గతంలో పలుమార్లు ఇదే పరిస్థితి నెలకొందని గ్రామస్తులు తెలిపారు. రహదారి సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

ప్రాణం తీసిన బైక్ సరదా

● రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి
● కన్నీటిపర్యంతమైన యువకుడి తండ్రి


బీచ్‌రోడ్డులో డివైడర్ వద్ద ప్రమాదానికి గురైన బైక్


ప్రమాదానికి గురైన బైక్‌తో గిరి(ఫైల్)

ఆరిలోవ(విశాఖ తూర్పు): బీచ్‌రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎంతో ఇష్టంగా కొనుక్కొన్న బైక్‌పై సరదాగా డ్రైవ్ చేసి ప్రాణాలు కోల్పోయాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం, కుంతుర్ల గ్రామానికి చెందిన పూటి గిరి ప్రసాద్‌నాయుడు(19) పాడేరులో మదర్ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. స్నేహితుడు జె.జగదీష్‌తో కలసి బైక్‌పై బుధవారం విశాఖలో బంధువుల ఇంటికి వచ్చాడు. అదే రోజు సాయంత్రం ఇంటి నుంచి స్నేహితుడితో కలసి బైక్‌పై నగరం చూడడానికి బయలుదేరాడు. రాత్రయినా ఇంటికి చేరకుండా తిరిగారు. ఈ క్రమంలో రాత్రి 11 గంటలు దాటిన తర్వాత బీచ్‌రోడ్డులో తెన్నేటి పార్కు నుంచి సాగర్‌నగర్ వైపు వెళ్తుండగా సీతకొండ చివరి మలుపు వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ డివైడర్, దానిపై ఉన్న ఎలక్ట్రికల్ పోల్‌ను ఢీకొంది. దీంతో కిందపడిన గిరిప్రసాద్ తలకు తీవ్రగాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. వెనుక కూర్చొన్న అతని స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. స్వల్ప గాయాలైన స్నేహితుడిని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని ఆ యువకుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి అక్క పి.ఐశ్వర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా గిరి తండ్రి మత్సలింగం నాయుడు ఉపాధ్యాయుడు. అమ్మ, అక్క ఉన్నారు. ఎంతో ఇష్టంగా ఇటీవల కొనుక్కొన్న కొత్త బైకే కుమారుడి ప్రాణాలు తీసిందంటూ మృతుడి తల్లిదండ్రులు బోరున విలపించారు. ఆ బైక్‌పై సరదాగా విశాఖ వచ్చి, ప్రాణాలు తీసుకున్నాడంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు.